సాక్షి
నారాయణపేట
సోమవారం । 11 । మార్చి । 2024



..'కురుమూర్తి'గిరులు

అమావాస్య నేపథ్యంలో కురుమూర్తిస్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు.

వివరాలు 8లో ▸



అందని బీమా

పాడి పశువులు చనిపోతే బీమా సౌకర్యం లేక రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు.

వివరాలు 9లో ▸

గరిష్టం/కనిష్టం
38.2 /27.3

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటూ అప్పుడప్పుడూ మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

పోరు.. జోరు

'స్థానిక' ఎమ్మెల్సీ ఉపఎన్నికకు నేటితో ముగియనున్న నామినేషన్ల గడువు

- సీఎం రేవంత్ నుంచి బీఫాం అందుకున్న కాంగ్రెస్ అభ్యర్థి మన్నె
- నేడు భారీ ర్యాలీతో నామినేషన్ దాఖలు చేయనున్న జీవన్‌రెడ్డి
- బీఆర్ఎస్ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డి సైతం..
- క్షేత్రస్థాయిలో మొదలైన క్యాంపు రాజకీయాలు



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉపఎన్నిక పోరు ఇక హోరెత్తనుంది. సోమవారంతో నామినేషన్లకు తుది గడువు ముగియనుండగా.. ఇదేరోజు ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు మన్నె జీవన్‌రెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి నామినేషన్ పత్రాలు దాఖలు చేయనున్నారు. ఈ మేరకు ఎవరికి వారు భారీ ఏర్పాట్లకు సన్నాహాలు మొదలుపెట్టారు. పోటాపోటీగా ఊరేగింపు, భారీ ర్యాలీల మధ్య ఇరువురు వేర్వేరు సమయాల్లో మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కౌంటర్‌లో నామినేషన్ పత్రాలు సమర్పించనున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి పాలమూరు జిల్లావ్యాప్తంగా రాజకీయ వాతావరణం వేడెక్కనుంది.

కాంగ్రెస్: ఉదయం 11 గంటలకు..

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో నిలిచిన ప్రముఖ పారిశ్రామికవేత్త, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు మన్నె జీవన్‌రెడ్డి ఆదివారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా బీఫాం అందుకున్నారు. ఈ కార్యక్రమంలో జీవన్‌రెడ్డి చిన్నాన్న, ఎంఎస్ఎన్ ఫార్మా పరిశ్రమల అధినేత మన్నె సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి జీవన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. సీఎం సహకారంతో ఉమ్మడి జిల్లా అభివృద్ధికి కృషి చేసేందుకు తనకు అవకాశం కల్పించాలని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. కాగా, జీవన్‌రెడ్డి ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య సోమవారం ఉదయం 11 గంటలకు నామినేషన్ దాఖలు చేసేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థి సైతం..

బీఆర్ఎస్ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డి శనివారం ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ చేతులమీదుగా బీఫాం అందుకున్నారు. ఈ క్రమంలో మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ సమావేశం సోమవారం ఏర్పాటు చేశారు. స్థానిక జేజేఆర్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభం కానుంది. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తోపాటు ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ శాసనసభ్యులు పాల్గొననున్న సమావేశంలో పార్లమెంట్ ఎన్నికల్లో వ్యవహరించాల్సిన అంశాలపై చర్చించనున్నారు. ఈ సమావేశం అనంతరం ముఖ్య నేతలు, పార్టీ శ్రేణులతో కలిసి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డి ర్యాలీగా వెళ్లి కలెక్టరేట్‌లో నామినేషన్ పత్రాలు సమర్పించనున్నారు.



సీఎం రేవంత్‌రెడ్డి నుంచి బీఫాం అందుకుంటున్న కాంగ్రెస్ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డి

28న పోలింగ్.. 2న లెక్కింపు

బీఆర్ఎస్‌కు చెందిన ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి గత డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌లో చేరి కల్వకుర్తి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తర్వాత ఆయన రాజీనామాతో ఎమ్మెల్సీ ఉపఎన్నిక అనివార్యమైంది. ఈ నేపథ్యంలో ఈ నెల నాలుగో తేదీన కేంద్ర ఎన్నికల సంఘం ఉప ఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. షెడ్యూల్ ప్రకారం సోమవారం నామినేషన్లకు తుదిగడువు కాగా.. ఎన్నికల అధికారులు 12న స్క్రూటీ్ని చేపట్టనున్నారు. నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు 14 కాగా.. 28న ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ జరగనుంది. వచ్చే నెల రెండో తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

క్షేత్రస్థాయిలో ప్రయత్నాలు..

స్థానిక సంస్థల ఓటర్లు అయిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు, ఎక్స్‌అఫీషియో మెంబర్లను తమవైపు తిప్పుకొనేందుకు ఎమ్మెల్సీ అభ్యర్థులు ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల్లో తమకు పరిచయం ఉన్న నేతల ద్వారా ఇదివరకే ప్రయత్నాలు ప్రారంభించారు. సోమవారంతో నామినేషన్ల ఘట్టం ముగియనుండడంతో ఎమ్మెల్సీ అభ్యర్థులు క్షేత్రస్థాయిలో ముమ్మరంగా పావులు కదిపేలా రంగం సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో క్యాంప్ రాజకీయాలు సైతం చోటుచేసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఆయా పార్టీల అభ్యర్థులు పలువురితో టచ్‌లోకి వెళ్లి హామీలు ఇవ్వడంతోపాటు క్యాంప్‌లకు సిద్ధంగా ఉండాలని చెప్పినట్లు సమాచారం.

న్యూస్‌రీల్

ఆలయాల్లో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

మక్తల్: శివరాత్రి తర్వాత వచ్చే **అమావాస్యను** పురస్కరించుకొని పట్టణంలోని ప**డమటి అం**జనేయస్వామి దేవాలయం, ఉమమాహేశ్వర ఆలయాలను ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి దర్శించుకున్నారు. ఆదివారం ముందుగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానం చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు లక్ష్మారెడ్డి, బీకేఆర్ చైర్మన్ బాలక్రిష్ణారెడ్డి, నాయకులు గణేష్‌కుమార్, మాజీ ఎంపిటిసి కోళ్ల వెంకటేష్, సురేష్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు మానవ జీవితంలో అంతర్భాగం



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: క్రీడలు మానవ జీవితంలో అంతర్భాగంగా ఉన్నాయని పీయూ వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్ అన్నారు. ఆదివారం పీయూ లైబ్రరీ ఆడిటోరియంలో 'ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో వచ్చిన మార్పులు– ధోరణులు' అంశంపై నిర్వహించిన అంతర్జాతీయ సెమినార్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. క్రీడల ద్వారా సంపూర్ణ ఆరోగ్యం దక్కుతుందని, ప్రతి ఒక్కరి జీవితంలో క్రీడలు భాగంగా మారాలన్నారు. పీయూలో క్రీడలకు పెద్దపీట వేస్తున్నామని, క్రీడాకారులకు మౌలిక వసతులు కల్పిస్తున్నామని, సింథటిక్ ట్రాక్ నిర్మాణం చేస్తున్నామని, బ్యాడ్మింటన్ కోర్టు, వాలీబాల్ కోర్టుల నిర్మాణం చేపడుతున్నామన్నారు. యూనివర్సిటీ స్థాయిలో క్రీడలకు ఎంతో ప్రాముఖ్యం ఉందని, వాటి ప్రాధాన్యతను విద్యార్థులు అర్థం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి, డీన్ ఫ్యాకల్టీ రాజేష్‌కుమార్, బీఓఎస్ ఫిజికల్ ఎడ్యుకేషన్ రాజేష్, భక్తియార్, లోహిత్, వీరేందర్, సోమలింగం, ప్రిన్సిపాల్ చంద్రకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో అమావాస్య పూజలు



ఎర్రవల్లిచౌరస్తా/మల్దకల్: అమావాస్యను పురస్కరించుకొని బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని పలు ఆలయాలు ఆదివారం భక్తులతో రద్దీగా మారాయి. ఈ సందర్భంగా అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టుప్రక్కల ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో చేరుకున్నారు. శివాలయం, కోదండరామస్వామి, సరస్వతీదేవితో పాటు అభయాంజనేయస్వామి ఆలయాలను దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు ఆంజనేయస్వామి ఆలయ పాలక మండలి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఈఓ రామన్‌గౌడ్ తెలిపారు.

ఆదిశిలా క్షేత్రంలో..

ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం అమావాస్యను పురస్కరించుకుని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

నష్టాల వ్యవస్థలను సరిదిద్దుతున్నాం

వనపర్తిటౌన్: గత పదేళ్లల్లో నష్టాల్లో కూరుకుపోయిన వ్యవస్థలను సరిదిద్దుతున్నామని.. ఇందులో భాగంగానే అవినీతి అధికారులను బయటకు పంపించి తిన్న సొమ్మును వసూలు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా. చిన్నారెడ్డి తెలిపారు. వేతన సవరణ, ఫిట్‌మెంట్ పెంపుపై హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం రాత్రి ఆర్టీసీ డిపోలో ఉద్యోగులు, కార్మికులు సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించేందుకు పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఆర్టీసీని విలీనం చేసే ప్రక్రియ చేపట్టే అవకాశం ఉందని పెంచిన ఫిట్‌మెంట్‌తో ఒక్కో కార్మికుడి పేస్కేల్ బేసిక్‌పై రూ.5 వేల నుంచి రూ.15 వేల వరకు పెరిగే అవకాశం ఉందన్నారు. ఆర్టీసీని ఆదుకునేందుకు జీరో టికెట్లతో రూ.300 కోట్లను ప్రతినెల చెల్లిస్తుందన్నారు.

సాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

- రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

వీపనగండ్ల: ఏడాదిలో సింగోటం, గోపల్‌దిన్నె లింక్ కెనాల్ పనులు పూర్తిచేసి సాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి సత్వర చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం మండలంలోని తూంకుంటలో జరిగిన పార్టీ మండలస్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని ప్రతి గ్రామంలో చేపట్టాల్సిన పనుల వివరాలను సేకరించిన అనంతరం కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేసే కార్యాచరణ చేపట్టిందన్నారు. నియోజకవర్గానికి మంజూరవుతున్న ఇందిరమ్మ ఇళ్లకు అర్హులనే ఎంపిక చేయాలని.. ఎలాంటి అవకతవకలు జరిగినా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండల కేంద్రంలోని 30 పడకల ఆస్పత్రికి అంబులెన్స్ వసతితో పాటు గ్రామంలో క్రీడా మైదానం ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బీరయ్య యాదయ్య, మాజీ సర్పంచ్‌లు గంగిరెడ్డి, బీరయ్య, కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, సీనియర్ నాయకులు నారాయణరెడ్డి, బాల్ రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, ప్రముఖ సంఘ సేవకులు వాలె మదన్‌మోహన్‌రావు, గోపాల్ నాయక్, గోపి, పోతుల వెంకట్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, రాంరెడ్డి, చినరాంబాబు, లొడుగు రాజు, విష్ణు, సారంగ జయప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

గ్యారంటీల అమలుతో బీఆర్ఎస్‌లో గుబులు

బిజినేపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తుండటంతో బీఆర్ఎస్‌లో గుబులు పుట్టిందని అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ అన్నారు. ఆదివారం వట్టెం వేంకటేశ్వర స్వామి ఆలయంలో పార్టీ నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలును వేగవంతం చేయడంతో బీఆర్ఎస్‌కు ప్రజాదరణ లేకుండా పోయిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆ పార్టీకి అభ్యర్థులు దొరకని పరిస్థితి నెలకొందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీలో ఒక్కో స్థానానికి ముగ్గురు నుంచి నలుగురు పోటీ పడుతున్నారని.. తాను కూడా నాగర్‌కర్నూల్ ఎంపీ టికెట్‌ను ఆశిస్తున్నట్లు చెప్పారు. ఎవరికి టికెట్ వచ్చినా కలిసికట్టుగా పనిచేసి, పార్టీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని అన్నారు.



మొదలైన భానుడి భగభగ

- జిల్లాలో రోజురోజుకూ పెరుగుతున్న ఎండలు
- ఇప్పటికే గరిష్ట ఉష్ణోగ్రత 39.0 డిగ్రీల సెల్సియస్ నమోదు

పాలమూరు: మండు వేసవికి ముందే భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. ఏప్రిల్ రాకముందే ఎండల తీవ్రత రోజురోజుకూ అధికమవుతోంది. జిల్లాలో ఈ నెల 9న గరిష్ట ఉష్ణోగ్రత 39.0 డిగ్రీల సెల్సియస్ నమోదవగా.. ఐదురోజులుగా జిల్లాలో క్రమంగా 2.6 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు పెరిగాయి. నానాటికి పెరుగుతున్న ఎండలతో జిల్లా ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఉదయం 9 గంటలకే భానుడి భగభగలు మొదలై సాయంత్రం 6 గంటల వరకు కొనసాగుతున్నాయి. పనులమీద బయటకు వస్తున్న ప్రజలు.. మధ్యాహ్నం వేళకే పనులు ముగించుకొని ఇళ్లకు చేరే ప్రయత్నాలు చేస్తున్నారు. ఆరుబయటకు వచ్చిన జనాలు ఉపశమనం పొందేందుకు నానా ఇక్కట్లు పడ్డారు. వివిధ ప్రాంతాల్లో నమోదైన వివరాల ప్రకారం మహబూబ్‌నగర్ రూరల్ మండలంలో ఎండ తీవ్రత అధికంగా ఉంది. ఇక్కడి ఆటోమేటిక్ వాతావరణ నమోదు కేంద్రంలో 39.0 డిగ్రీల సెల్సియస్ రికార్డు నమోదైంది. మరో ఎనిమిది మండలాల్లో 38 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు రికార్డు కావడం ఆందోళన కలిగిస్తోంది. ఇప్పుడే ఎండలు ఈ విధంగా ఉంటే ముందు రోజుల్లో ఏ మేరకు ఉండనున్నాయోనని భయపడుతున్నారు.

మధ్యాహ్నం రోడ్లు ఖాళీ..

మహబూబ్‌నగర్ టు రాయిచూర్, హైదరాబాద్ టు మహబూబ్‌నగర్, భూత్పూర్ ప్రధాన రహదారులతోపాటు పట్టణాలు, గ్రామాల్లోని రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ద్విచక్ర వాహనదారులు తలకు టోపీలు ధరిస్తూ, ముఖాలకు గుడ్డలు కట్టుకుని జాగ్రత్త పడుతున్నారు. పాదచారులు గొడుగు నీడన అడుగులు వేస్తూ భానుడి ప్రతాపం నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు.

బీసీలను విస్మరిస్తే.. మూల్యం చెల్లించుకోవాల్సిందే



- బీసీ సమాజ్ జనగర్జన మహాసభలో బీసీ సంఘాల నాయకుల హెచ్చరిక

– స్టేషన్ మహబూబ్‌నగర్

వివరాలు 8లో ▸

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

మక్తల్: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వంశీచందర్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. ఆదివారం పట్టణంలో నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈసమావేశానికి ఎంపీ అభ్యర్థి వంశీచందర్‌రెడ్డి హాజరైయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం అందరు కలిసికట్టుగా పని చేయాలని, అధిష్టానం నిలబెట్టిన అభ్యర్థికి పూర్తిగా సహకరించి వంశీచందర్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేయాలని అన్నారు. వంశీచందర్‌రెడ్డి ప్రజల మధ్య ఉంటు సేవలు అందించిన నాయకుడని, గత అసెంబ్లీ ఎన్నికల్లో ఏ విధంగా గెలుపుకోసం పని చేశారో ఎంపి ఎన్నికల్లో ప్రతి గ్రామంలో బూత్‌నుంచి మెజార్టీ రావాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రవేశ పెట్టిన 6 గ్యారేంటీల పథకంపై ప్రజలకు అవగహన కల్పించాలని కోరారు. ఎన్నికల్లో టీం ఏర్పాటు చేసుకోని పని చేయాలని కోరారు. అనంతరం వంశీచందర్‌రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలు తనపై నమ్మకం పెట్టి భారీ మెజారీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజ్‌గౌడ్, లక్ష్మారెడ్డి, బాలక్రిష్టారెడ్డి, హన్మంతు, మణేమ్మ, నారాయణరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, అనంద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, పక్కన ఎంపీ అభ్యర్థి వంశీచందర్‌రెడ్డి

'పది' ప్రశ్నపత్రాలు వచ్చాయ్..



ఊట్కూరు పోలీసు స్టేషన్‌లో ప్రశ్నపత్రాలను భద్రపరుస్తున్న అధికారులు

ఊట్కూరు: పదో తరగతి వార్షిక పరీక్షలు ఈ నెల 18న ప్రారంభం కానున్న నేపథ్యంలో ఇందుకు సంబంధించి ప్రశ్నపత్రాల రెండవ సెట్‌ను ఆదివారం పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచారు. ఈ సందర్భంగా చీఫ్ కస్టోడియన్ సురేష్, డిపార్ట్‌మెంట్ అధికారి దత్తురావు మాట్లాడుతూ మండలంలో ఊట్కూరులో బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, పులిమామిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొత్తం నాలుగు కేంద్రాలలో పరీక్ష కేంద్రాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఊట్కూరులో బాలుర ఉన్నత 112 మంది, బాలికల ఉన్నత పాఠశాలలో 161 మంది, పులిమామిడి ఉన్నత పాఠశాలలో 160, కెజివిబి పాఠశాలలో 98 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు రాజుగోపాల్, రఘువీర్, సత్యనారాయణ, రాములు, భాస్కర్, వెంకటరాములు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ఇంటింటికీ వివరించాలి

కోస్గి: కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికి ప్రచారం చేయాలని, త్వరలోనే జరగనున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 12న హైద్రాబాద్ ఎల్బీ స్టేడియంలో జరిగే కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సభకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని బీజేపీ నాయకుడు రాము సూచించారు. ఆదివారం నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకుల సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికల శంఖారావం పూరించడానికి అమిత్ షా రాష్ట్రానికి వస్తున్న నేపథ్యంలో ప్రతి గ్రామం నుంచి అధిక సంఖ్యలో ప్రజలు హాజరుకావాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సీబీ వెంకటేష్, పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్, బీజేవైఎం అధ్యక్షుడు శ్రీకాంత్ గౌడ్, నాయకులు నారాయణ, శ్రీనివాస్, రమేష్, సందీప్, వెంకట్ రాములు, నరేష్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాము

ప్రజల్లో విశ్వాసం కల్పించేందుకే పోలీసు కవాతు



ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న ప్రత్యేక బలగాలు

కోస్గి: ప్రజల్లో విశ్వాసం కల్పించడమే లక్ష్యంగా పోలీసు ప్రత్యేక బలగాలతో కవాతు నిర్వహిస్తున్నామని ఎస్‌ఐ శేఖర్ గౌడ్ అన్నారు. ఈ మేరకు ఆదివారం పోలీస్ స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేక బలగాలతో కవాతు నిర్వహించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం వంటిదని, ఎన్నికలు ఏవైన ప్రజలు తమ ఓటు హక్కును ధైర్యంగా వినియోగించుకోవాలని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసమే పోలీసు శాఖ ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తుందని సూచించారు. ఎన్నికల నేపథ్యంలో ప్రజల్లో మనోధైర్యం కల్పించడంతోపాటు ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడమే పోలీసు శాఖ లక్ష్యంగా ఇలాంటి ప్రదర్శనలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ మేరకు గుండుమాల్ మండల కేంద్రంతోపాటు బలభద్రాయపల్లి, బోగారం గ్రామాల్లో ప్రత్యేక పోలీస్ బలగాలతో పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఏఎఫ్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'కిసాన్ సమ్మాన్'కు దూరం

- రైతులకు ఈ–కేవైసీపై అవగాహన కరువు
- అనుసంధానం కాని ఆధార్, ఫోన్ నంబర్లు
- జిల్లాలో 2,356మంది పెట్టుబడి సాయానికి దూరం
- రైతుల ఖాతాలో జమ అవుతున్న 16వ విడత నిధులు



వరిపంటకు యూరియా చల్లుతున్న రైతు (ఫైల్)

మరికల్: కేంద్ర ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయంగా అందజేస్తున్న ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకానికి వందల సంఖ్యలో రైతులు దూరమయ్యారు. కొన్నేళ్లుగా వ్యవసాయ భూమికి సంబంధించి పెట్టుబడి సాయానికి ఆధార్, ఫోన్ నంబర్లను అనుసంధానం చేసుకోలేదు. ఈకేవైసీ చేసుకోకపోవడంతో కేంద్రం అందిస్తున్న పెట్టుబడి సాయం పొందలేకపోతున్నారు. అవగాహన లోపంతో రైతులను అధికార యాంత్రాంగం చైతన్యపరచకపోవడం ఇందుకు కారణం, వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో ఈకేవైసీ చేసుకోని రైతుల దగ్గరకు వెళ్లి చేయిస్తే తప్ప పూర్తయ్యే అవకాశం లేదు.

మూడు విడతలుగా సాయం

కేంద్ర ప్రభుత్వం రైతులందరికీ లబ్ధి చేకుర్చేందుకు ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి ఏర్పాటు చేసింది. ప్రతి ఏడాది రైతులకు పెట్టుబడి సాయంగా మూడు విడతలుగా రూ. 6 వేలను అందజేస్తోంది. ఒక్కో విడతలో అర్హులైన ప్రతి రైతు ఖాతాల్లో రూ. 2 వేల చొప్పున జమ చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు 15 విడతలుగా నిధులను విడుదల చేయగా మార్చి మొదటి వారంలో 16వ విడత నిధులు జమకు చర్యలు చేపట్టింది. ఈకేవైసీ చేయించుకున్న రైతులను లబ్ధిదారులుగా గుర్తించి వారందరికి ఖాతాల్లో పెట్టుబడి అందేలా చూస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం

తమ శాఖ పరంగా ప్రతి ఏడాది ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కింద అమలు చేస్తున్న పెట్టుబడి సాయం కోసం రైతులకు అవగాహన కల్పించడం వల్లే సంఖ్య తగ్గుతూ వస్తోంది. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 2వేలకు పైగా ఈకేవైసీ చేసుకోలేదు. వారిని కూడా పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకుంటాం.

– జాన్ సుధాకర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

77,478 మందివి ఈకేవైసీ పూర్తి..

జిల్లాలో మొత్తం 79,834 మంది రైతులకు గాను 77,478 మంది రైతులు ఈ–కేవైసీ చేసుకున్నారు. ప్రతి మండలంలోనూ 50 నుంచి 100 మంది రైతుల వరకు ఈ కేవైసీ చేసుకోలేకపోయారు. ప్రస్తుతం జిల్లాలో 2356 మంది రైతులు పెట్టుబడి సాయం పొందలేకపోతున్నారు. దీనికి తోడు రైతుల వేలిముద్రలు, కన్నురెప్పలు సక్రమంగా లేకపోవడంతో జిల్లా వ్యాప్తంగా దాదాపు 500 మంది రైతులు ఈకేవైసీ చేసుకోవానికి వీలేకుండాపోయింది. అర్హులుగా ఉండి ఈకేవైసీ చేసుకునే ప్రయత్నం చేసినా వేలిముద్రలు, కంటిచూపు పనిచేయకపోవడంతో పెట్టుబడి సాయం పొందలేని పరిస్థితి నెలకొంది.

కిక్కిరిసిన కురుమూర్తి గిరులు


క్యూలైన్లలో నిలుచున్న భక్తులు


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

- మార్మోగిన గోవింద నామస్మరణ

చిన్నచింతకుంట: తెలంగాణ ప్రజల ఆరాధ్య దైవం అమ్మాపురం కురుమూర్తిస్వామి ఆలయ దర్శనానికి ఆదివారం అమావాస్య రోజున భక్తులు భారీగా పోటెత్తారు. అర్చకులు ఆలయాన్ని శుద్ధిచేసి సుప్రభాతసేవ అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి భక్తులు ఉదయాన్నే తరలివచ్చి క్యూలైన్లలో నిలుచున్నారు. పలువురు భక్తులు మెట్లపై దీపాలు వెలిగిస్తూ కొబ్బరికాయలు కొట్టి స్వామివారిని దర్శించుకోవడం కనిపించింది. కొందరు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకోగా.. మరికొందరు కొండ దిగువన మట్టికుండలో అన్నం, పచ్చిపులుసు వండి స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు. కొండపైన అలివేలు మంగమ్మ, చెన్నకేశవ స్వామి, ఆంజనేయస్వామి, ఉద్దాల మండపం వద్ద భక్తుల రద్దీ కనిపించింది.

అన్నదాన సత్రం వద్ద భక్తుల తోపులాట..


అన్నదాన సత్రంలోకి ఒకే ద్వారం నుంచి భక్తులను అనుమతించారు. దీంతో భక్తులు సత్రం వద్ద ఏర్రటి ఎండలో బారులు తీరారు. క్యూలైన్‌లలో నిల్చున్న భక్తులకు టెంట్లు కూడా ఏర్పాటు చేయలేదు. కనీసం సరిపడా విస్తర్లు కూడా లేకపోవడంతో దుకాణాల్లో రూ.10 ఒకటి చొప్పున భక్తులు కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి కనిపించింది.

మహిమాన్విత క్షేత్రం.. శ్రీరామకొండ

కోయిల్‌కొండ: ఆదివారం అమావాస్య పురస్కరించుకొని మండల కేంద్రం సమీపంలోని శ్రీరామకొండకు భక్తులు పోటెత్తారు. ఉదయం 3 నుంచి సాయంత్రం వరకు భక్తులు క్యూలైన్‌లలో నిలబడి రామపాదాన్ని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వై.రఘురామాచారి, రాఘవేందర్‌రావు ఉదయం మూల విగ్రహాలకు ప్రత్యేక అభిషేకం, అర్చన, విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో కోనేరు వద్ద తాగునీటి వసతి కల్పించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్‌ఐ రాఘవేందర్‌తో పాటు సిబ్బంది పర్యవేక్షించారు.

సివిల్ జడ్జి ప్రత్యేక పూజలు..

మహబూబ్‌నగర్ సీనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి నిహారిక శ్రీరామపాదాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అమావాస్య పురస్కరించుకొని కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.


దర్శనానికి బారులుతీరిన భక్తులు, ఇన్‌సెట్‌లో స్వామి వారికి పూజలు చేస్తున్న అర్చకుడు

క్లుప్తంగా

వాహనం ఢీకొని యువకుడి దుర్మరణం

నాగర్‌కర్నూల్ క్రైం: గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని వనపట్ల గేటు శివారులో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు.. కోడేరు మండలం ఎత్తం గ్రామానికి చెందిన మాండ్ల సాంబశివుడు (30) ద్విచక్రవాహనంపై వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం వనపట్ల గేటు శివారులో ఢీకొనడంతో మాండ్ల సాంబశివుడు తలకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడికి ఆరు నెలల క్రితమే వివాహమైంది. ఘటనకు సంబంధించిన ఎస్‌ఐ గోవర్ధన్‌ను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

చేపల వేటకు వెళ్లి యువకుడి మృతి

కోడేరు: మండలంలోని తుర్కదిన్నె డ్యాంలో చేపల వేటకు వెళ్లి ఓ యువకుడు విద్యుదాఘాతానికి గురై మృతిచెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. ముత్తిరెడ్డిపల్లి చెందిన రాముడు(28)తోపాటు మరో ఇద్దరు తుర్కదిన్నె డ్యాంలో చేపల వేటకు వెళ్లారు. డ్యాం నీటిలో ఓ రైతు విద్యుత్ మోటారును ఏర్పాటు చేసుకున్నాడు. అయితే విద్యుత్ మోటార్‌కు వెళ్లిన వైర్లకు మరో తీగను అమర్చి నీటిలోని చేపలు చనిపోవడానికి వేశాడు. కరెంట్ నీటి గుంత మొత్తం విద్యుత్ సరఫరా కావడతో నీటిలో ఉన్న రాముడు షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. ఒడ్డున ఉన్న ఇద్దరు వ్యక్తులు అక్కడి నుంచి పారిపోయారు. ఈ క్రమంలోనే సమాచారం అందుకున్న తుర్కదిన్నె గ్రామస్తులు వెళ్లి చూసి బంధువులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలాన్ని ఎస్‌ఐ కురుమూర్తి పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెద్దకొత్తపల్లి: మండలంలోని సంజీవపూర్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన శివ (18) హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పాల కొనుగోలుకు గ్రామం నుంచి పెద్దముద్దనూరుకు బైక్‌పై ముగ్గురు యువకులు వెళ్తుండగా నాగర్‌కర్నూల్ నుంచి వస్తున్న బస్సు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండటంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు.

మల్లేపల్లిలో మరొకరు..

రాజాపూర్: పురుగు మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి పరిస్థితి విషమించడంతో మృతిచెందిన సంఘటన ఆదివారం మండలంలోని మల్లేపల్లిలో చోటుచేసుకుంది. వివరాలిలా.. గ్రామానికి చెందిన అల్లె రామకృష్ణ (35)కు మిడ్జిల్ మండలం వస్పులకు చెందిన మమతతో 13 సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి ఒక కుమారుడు ఉండగా మరో కుమారుడు పుట్టి చనిపోయాడు. అప్పటి నుంచి రామృష్ణ తాగుడుకు బానిసై భార్యను కొట్టేవాడని దీంతో భార్య తన తల్లిగారి గ్రామానికి వెళ్లి అక్కడే ఉంటోంది. దీంతో మద్యం ఎక్కువగా తాగుతూ జీవితంపై విరక్తి పెంచుకున్న రామకృష్ణ రెండు రోజుల క్రితం గ్రామ శివారులో పొలం వద్ద పురుగు మందుతాగి పడి ఉన్నాడు. చుట్టు పక్క రైతులు గమనించి 108లో మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఈ ఘటనపై రామకృష్ణ అక్క బాలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ రవి తెలిపారు.

యాపర్లలో యువకుడు..

పెబ్బేరు రూరల్: చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటన యాపర్లలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. యాపర్లకు చెందిన కావలి శివశంకర్ కడుపునొప్పి భరించలేక ఈ నెల 4వ తేదీన పురుగు మందు తాగాడు. పనికి వెళ్లి ఇంటికి వచ్చిన తండ్రి కావలి ఆంజనేయులు వాకిట్లో పడిపోయిన కొడుకును చూసి వెంటనే హైదారాబాద్‌లోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి ఈ నెల 7న కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మత్స్యసంబురం



మక్తల్ మండలం పస్పుల కృష్ణానది ఘాట్ వద్ద ఆదివారం మత్స్యకారులు చేపల వేట సాగించగా.. భారీ చేప వలకు చిక్కింది. 30 కేజీల బొచ్చె రకం చేప లభించిందని.. ఈ చేపకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని మత్స్యకారులు అశోక్, నర్సింహులు, ఆనంద్, పరుశరాంలు తెలిపారు.

- మక్తల్

ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ఉపాధ్యాయుడికి చోటు



దేవరకద్ర: కౌకుంట్లలోని గుడ్ ఫర్ షెఫర్డ్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా పనిచేసే రాజుకు ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది. ఆదివారం హైదరాబాద్‌లోని థామస్ కేథడ్రాల్ చర్చిలో ఏర్పాటు చేసిన ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్ ఈవెంట్స్‌లో పేరు సంపాదించారు. మ్యూజిల్ స్కూల్ విజయవాడ వ్యవస్థాపకులు ఆగష్టన్ దండింగి నేతృత్వంలో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 300 మంది సంగీత వాయిద్యాకారులతో నిర్విరామంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు భక్తి సంగీతం నిర్వహించారు. సామూహిక సంగీత కార్యక్రమానికి ఎంపికైన 300 మందిలో రాజు ఒకరు. ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కినందుకు సంతోషంగా ఉందని రాజు తెలిపారు.

ఎదురెదురుగా రెండు బస్సులు ఢీ

- ముగ్గురు ప్రయాణికులకు స్వల్పగాయాలు


ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సులు

జడ్చర్ల టౌన్: ఎదురెదురుగా రెండు ఆర్టీసీ బస్సులు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు ప్రయాణికులకు స్వల్పగాయాలయ్యాయి. ఈ ఘటన జడ్చర్ల బస్టాండ్ సమీపంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. కుషాయిగూడ డిపోకు చెందిన ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు ఆదివారం హైదరాబాద్ నుంచి కర్నూల్‌కు వెళ్తూ.. మార్గమధ్యంలో ఉన్న జడ్చర్ల బస్టాండ్‌కు ఉదయం 11గంటలకు చేరుకుంది. ఇక్కడ కొందరు ప్రయాణికులను ఎక్కించుకున్న డ్రైవర్.. వారికి టికెట్లు ఇస్తూ, బస్సును ముందుకు పోనిచ్చాడు. ఈక్రమంలో ఎదురుగా వస్తున్న హైదరాబాద్ డిపో-1కు చెందిన గరుడ ప్లస్ బస్సును గమనించకుండా ఢీకొట్టాడు. ప్రమాదంలో సూపర్ లగ్జరీ బస్సులో ప్రయాణిస్తున్న ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. కాగా, గరుడ ప్లస్ బస్సు డ్రైవర్ హారన్ కొట్టినా సూపర్ లగ్జరీ బస్సు డ్రైవర్ వినకపోవడంతోనే ప్రమాదం చోటుచేసుకుందని స్థానికులు తెలిపారు. గరుడ ప్లస్ బస్సు డ్రైవర్ కూడా గమనించకుండా వేగంగా వచ్చి ఉంటే, ప్రమాదం తీవ్ర స్థాయిలో ఉండేదని పేర్కొన్నారు. సూపర్ లగ్జరీ బస్సును గమనించి, గరుడ ప్లస్ బస్సును నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పిందని తెలిపారు. కాగా, రెండు బస్సుల్లో 24 మంది ప్రయాణికులు ఉన్నారు.

సిమెంట్ దిమ్మెను ఢీకొన్న బైక్

- యువకుడు మృతి, మరో ఇద్దరికి గాయాలు


మహేష్ (ఫైల్)

ఎర్రవల్లిచౌరస్తా: 44వ జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనం అదుపుతప్పి సిమెంట్ దిమ్మెను ఢీకొనగా అక్కడికక్కడే యువకుడు దుర్మరణం చెందగా, మరో ఇద్దరికి గాయాలపైన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఇటిక్యాల ఎస్‌ఐ వెంకటేష్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లాలోని శ్రీరంగాపురం మండలం జానంపేటకు చెందిన మహేష్(18) తన మిత్రులు బాలు, వీరేష్‌లతో కలిసి ద్విచక్రవాహనంపై స్వగ్రామం నుంచి గద్వాలకు పని నిమిత్తం బయలుదేరారు. మార్గమధ్యలో జాతీయ రహదారిపై ఎర్రవల్లి సమీపంలోకి రాగానే వారు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనం ప్రమాదవశాత్తు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న సిమెంట్ దిమ్మెను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మహేష్ తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందగా, ఇద్దరికి కూడా గాయాలు కావడంతో స్థానికులు హుటాహుటిన గద్వాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం కర్నూల్‌కు తరలించినట్లు తెలిపారు. మృతు ని తండ్రి కుర్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. ప్రమాద సమయంలో బైక్‌పై ట్రిబుల్ రైడింగ్ ఉండటంతో పాటు హెల్మెట్ ధరించకపోవడంతోనే యువకుడు నిండు ప్రాణాలు కోల్పోయినట్లు స్థానికులు తెలిపారు.

హైవే దాటుతుండగా హోంగార్డు..

అడ్డాకుల: జాతీయ రహదారి నడుచుకుంటూ దాటుతున్న ఓ హోంగార్డును గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఎస్‌ఐ ఎం.శ్రీనివాస్ కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్‌కు చెందిన కె.ధన్‌రాజ్ రాథోడ్(38) గద్వాల జిల్లా బీచుపల్లి పదో బెటాలియన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి మహబూబ్‌నగర్ వస్తూ శాఖాపూర్ టోల్‌ప్లాజా దాటిన తర్వాత ఓ హోటల్‌లో భోజనం చేయడానికి ఆగాడు. అక్కడ భోజనం చేసి మహబూబ్‌నగర్ వెళ్లడానికి నడుచుకుంటూ రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ వైపు వెళ్లే గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో హోంగార్డుకు తీవ్రగాయాలై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి.. మృతదేహాన్ని జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా.. ప్రమాదానికి కారణమైన వాహనం కోసం పోలీసులు గాలిస్తున్నారు. హోంగార్డు కుటుంబ వివరాలు తెలియాల్సి ఉంది.

రిజర్వాయర్‌లో వృద్ధుడి మృతదేహం లభ్యం

గోపాల్‌పేట: ఇటీవల తప్పిపోయిన వృద్ధుడు రిజర్వాయర్‌లో శవమై తేలిన ఘటన రేవల్లి మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని శానాయిపల్లికి చెందిన కండె బాలచంద్రయ్య (69) మూడు రోజుల క్రితం శానాయిపల్లి గట్టు వద్దకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయటకు వచ్చాడు. ఆ తర్వాత తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యుల వెతికినా ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం ఏదుల రిజర్వాయర్‌లో శవం నీటిపై తేలి ఉండటం గమనించిన కొందరు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చి రిజర్వాయర్ వద్దకు వెళ్లి మృతదేహాన్ని పరిశీలించగా బాలచంద్రయ్యదే అని నిర్ధారించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆయిల్‌పాం తోట దగ్ధం

పెంట్లవెల్లి: మండలంలోని కొండూరులో ఆదివారం రైతు శంకర్‌కు చెందిన ఆయిల్‌పాం తోట ప్రమాదవశాత్తు దగ్ధమైంది. స్థానికుల వివరాల మేరకు.. బాధిత రైతు ఐదేళ్ల కిందట మూడెకరాల్లో ఆయిల్‌పామ్ తోట సాగుచేయగా.. ప్రస్తుతం గెలలు కోత దశకు వచ్చాయి. మరో వారం రోజుల్లో కోత చేపట్టేందుకు సిద్ధమవుతున్న తరుణంలో తోటకు నిప్పంటుకొని పూర్తిగా దగ్ధమైంది. వ్యవసాయ పొలంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద నిప్పులు పడటంతోనే మంటలు చెలరేగి ఉంటాయని గ్రామస్తులు అనుమానం వ్యక్తంచేశారు. ఆయిల్‌పామ్ తోట దగ్ధం కావడంతో రైతు శంకర్‌కు రూ.5 లక్షల మేర నష్టం వాటిల్లిందని, బాధిత రైతును ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు అపహరణ

గద్వాల క్రైం: అమవాస్య సందర్భంగా దేవాలయానికి వెళ్తున్న వృద్ధురాలి మెడలో గుర్తుతెలియని దుండగులు బంగారు గొలుసు అపహరించిన ఘటన ఆదివారం ఉదయం పట్టణంలో చోటు చేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలో పాత హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన విజయలక్ష్మి ఉదయం నదిఅగ్రహారం రోడ్డు మార్గన ఉన్న ఆంజనేయ స్వామి ఆలయానికి నడుచుకుంటూ వెళ్తుంది. గుర్తుతెలియని దుండగులు బైక్‌పై వచ్చి ఆమె మెడలో ఉన్న ఐదు తులాల బంగారు గొలుసును ఎత్తుకెళ్లారు. ఆమె తెరుకునే లోపే బైక్‌పై తప్పించుకుని పోయారు. స్థానికుల సాయంతో దుండగులను అదుపులోకి తీసుకునేందుకు వెంబడించిన ఫలితం లేకపోయింది. దీంతో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు విచారణ చేపడుతున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

ముగ్గురికి రిమాండ్

పెబ్బేరు రూరల్: పట్టణంలోని నాగవరం శివారు సర్వేనంబరు 56లో ప్లాట్ లేకున్నా ఉన్నట్లు సృష్టించి విక్రయించిన ముగ్గురిని ఆదివారం రిమాండ్‌కు తరలించినట్లు వనపర్తి రూరల్ ఎస్‌ఐ జలంధర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. పట్టణానికి చెందిన రియల్ వ్యాపారులు కొమ్ము శ్రీనివాసులు, ఆంజనేయులు, మురళి తప్పుడు దస్తావేజులు సృష్టించి 2018లో కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన ధర్మన్నకు రూ.18 లక్షలకు విక్రయించారు. బాధితుడు ఈ నెల 8న ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. నకిలీ పత్రాలతో తప్పుడు రిజిస్ట్రేషన్ చేసి మోసగించిన ముగ్గురిని ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ వివరించారు.

వివాహిత అదృశ్యం: కేసు నమోదు

ధరూరు: ఓ వివాహిత మహిళ అదృశ్యమైన సంఘటన మండలంలోని పారుచర్లలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పారుచర్ల గ్రామానికి చెందిన మమత(24) వివాహిత ఈ నెల 4వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఇప్పటి వరకు తిరిగి రాకపోవడంతో ఆమె భర్త సింధనూరు గోపాల్ ఆదివారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. చుట్టుపక్కల గ్రామాలు, బంధువుల ఊళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

మొసలి పట్టివేత



గద్వాల అర్బన్: గద్వాల మండలం జమ్మిచేడు-వెంకంటోనిపల్లి సమీపంలోని వ్యవసాయ పొలంలో సంచరిస్తున్న మొసలిని ఆదివారం ఫారెస్ట్ అధికారులు పట్టుకున్నారు. కృష్ణానది బ్యాక్ వాటర్ నుంచి వ్యవసాయ పొలంలోకి వచ్చిన మొసలిని రైతు రాజశేఖర్ గుర్తించి, ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. సమీప పొలాల రైతుల సహకారంతో మొసలిని పట్టుకున్నామని, అది సుమారు 50 కిలోలు ఉంటుందని ఫారెస్ట్ అధికారి వాజీద్ తెలిపారు. పట్టుబడిన మొసలిని జూరాల ప్రాజెక్టులో వదిలేసినట్లు పేర్కొన్నారు.

వ్యక్తి బలవన్మరణం

కోడేరు: మండల కేంద్రంలోని ఊరగుట్టకు చెందిన బుజమోని వెంకటస్వామి (45) ఆదివారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. వారి కథనం మేరకు.. వెంకటస్వామి తన భార్య సాయిలీలతో గొడవ పడటంతో ఆమె తల్లి గారి ఇంటికి వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో వెంకటస్వామి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

బీసీలను విస్మరిస్తే.. మూల్యం చెల్లించుకోవాల్సిందే


మాట్లాడుతున్న బీసీ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యారావు

- బీసీ సమాజ్ జనగర్జన మహాసభలో బీసీ సంఘాల నాయకుల హెచ్చరిక

స్టేషన్ మహబూబ్‌నగర్: బీసీలను విస్మరిస్తే, రాబోయే ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోందని బీసీ కుల సంఘాల నాయకులు హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం బీసీ సమాజ్ మహబూబ్‌నగర్ ఆధ్వర్యంలో బీసీ జనగర్జన మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రధాన రాజకీయ పార్టీలు బీసీలను చిన్నచూపు చూస్తున్నాయని, ఇది మంచి పరిణామం కాదన్నారు. బీసీలు ఏకమై రాజ్యాధికారం సాధించుకునే రోజులు దగ్గరలో ఉన్నాయన్నారు. ప్రధాన రాజకీయ పార్టీలు బీసీలకు సీటు ఇవ్వలేని పరిస్థితి ఉంటే, బీసీలే ప్రతి నియోజకవర్గం నుంచి ఎంపీ అభ్యర్థులుగా బరిలో ఉంటారని.. తద్వారా బీసీ వాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. బీసీ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు సంగెం సూర్యారావు మాట్లాడుతూ.. బీసీలను విస్మరించే పార్టీలకు తగిన గుణపాఠం చెబుతామన్నారు. బీసీ వాదాన్ని జిల్లా నలుమూలల వ్యాపింపజేసి, బీసీల విలువ ఏంటో సమాజానికి తెలియజేస్తామన్నారు. బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్‌సాగర్ మాట్లాడుతూ 60 నుంచి 65 శాతం ఉన్న బీసీ జనాభాను రాజకీయ పార్టీలు విస్మరించడం తగదన్నారు. రాబోయే ఎన్నికల్లో బీసీ సమాజ్ ఏవిధంగా ముందుకు వెళ్లాలనే అంశంపై మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో కుల, ప్రజా సంఘాల ద్వారా నిర్ణయం తీసుకొని, అగ్రవర్ణాలకు తగిన బుద్ధి చెబుతామన్నారు. జనగర్జన సభలో బీసీ సమాజ్ కోకన్వీనర్ సవారి సత్యం, దేవరకద్ర కన్వీనర్ బి.శేఖర్, నాగర్‌కర్నూల్ మహిళా విభాగం కన్వీనర్ శివాని, మక్తల్ బీసీ సమాజ్ యూత్ కన్వీనర్ శ్యాంసుందర్‌గౌడ్, సగర సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రణీల్‌చందర్, జాంద్ర సంఘం అధ్యక్షుడు మహేందర్, కుమ్మరి సంఘం అధ్యక్షుడు బుగ్గన్న, ఆరెకటిక సంఘం అధ్యక్షుడు రాజేష్ వెంకటనర్సయ్య, ఆలిండియా యాదవ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వకీల్ భీమయ్య, రజక సంఘం నాయకుడు నడిమింటి శ్రీనివాసులు, నాయీబ్రాహ్మణ సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రమేష్, వనపర్తి జిల్లా నాయీబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు రమేష్, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు అనంతరాములు, బాలవర్ధన్‌గౌడ్, చిన్న కిష్టయ్య సాగర్, పద్మావతి సగర, కోట్ల కిషోర్, డీకే నాయీ, కిన్నెర శేఖర్, లక్ష్మీకాంత సారంగి తదితరులు పాల్గొన్నారు.

కల్లు సీసాలో పాము కలకలం


కల్లు సీసాలో కనిపిస్తున్న పాము

భూత్పూర్: మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మున్సిపాలిటీలోని అమిస్తాపూర్‌లో ఆదివారం సాయంత్రం కల్లు సీసాలో పాము పిల్ల కనిపించడంతో కలకలం రేపింది. గ్రామస్తులు, ఎస్‌ఐ శ్రీనివాసులు కథనం ప్రకారం.. జిల్లాకేంద్రం నుంచి ఓ కాంట్రాక్టర్ కల్లు తీసుకొచ్చి చుట్టుపక్కల గ్రామాల్లో సరఫరా చేస్తుంటారు. ఈ క్రమంలో అమిస్తాపూర్‌లో మూడు చోట్ల కల్లు విక్రయాలు చేపడుతుండగా.. మూడో కల్లు దుకాణం చెన్నాగౌడ్ అనే వ్యక్తి కల్లు విక్రయిస్తుంటాడు. గ్రామానికి చెందిన కోట్ల మణెమ్మ చెన్నాగౌడ్ కల్లు దుకాణం వద్ద కల్లు సీసాను తీసుకొని కొద్దిగా కల్లు తాగింది. రెండోసారి తాగుతుండగా సీసాలో పాము పిల్ల కనిపించడంతో భయాందోళనకు గురై కింద పడిపోయింది. వెంటనే స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతో మణెమ్మ కుమారుడు శ్రీశైలం కల్లు సీసాను భూత్పూర్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించి.. తల్లి మణెమ్మను మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై లిఖిత పూర్వకంగా ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ చెప్పారు.